


మల్లాది వెంకటకృష్ణమూర్తి

# త్రిభుజం

"మీ పేరు?" అడిగాడు దర్శకుడు ఆ అమ్మాయిని ఎగాదిగా చూసి.

"నిరూప."

"ఏ డ్రామాలలో నటించారు?"

"పౌరాణికాలు - సాంఘికాలు. హరిశ్చంద్ర, రామాంజనేయ యుద్ధం. చిల్లర కొట్టు చిట్టెమ్మ, రాముడు - రంగడు, వీటిల్లో చాలాసార్లు నటించాను."

"ఇక్కడ షూటింగ్ జరుగుతోందన్న సంగతి ఎలా తెలుసు నీకు?" అడిగాడు అసోసియేట్ డైరెక్టర్ నిరూపని.

"మీ డాన్స్‌మాష్టారు చెప్పారు నిన్న వుదయం," అని దర్శకుడితో చెప్పింది మళ్ళీ.

"మీరామధ్య చిన్న బడ్జెట్ చిత్రానికి కొత్తమ్మాయి కోసం వెదుకుతున్నారని

తెలిసి నా ఫొటోలు, అప్లికేషన్ పంపాను. మద్రాసులో ఓ సౌండ్ ఇంజనీర్ మా ఇంటివాళ్ళకి బంధువు. అయనకి కూడా నాలుగయిదు ఉత్తరాలు వ్రాస్తే, తెల్సినవాళ్ళకి రికమండ్ చేస్తామని బదులు రాసారు."

"మీకు గుర్తున్న డైలాగ్స్‌తో ఓ బిట్ నటించి చూపించండి. ఏదయినా ఓ నాటకంలోది," చెప్పాడు డైరెక్టర్.

"నేను రెడీ సార్," అరిచాడు కెమేరామెన్.

"ఒన్ మినిట్. ఇంకో షాట్ తీసాక...." దర్శకుడు హడావిడిగా నెహ్రూ జూపార్క్‌లోని కోతులుండే ప్రదేశానికి వెళ్ళాడు.

నిరూప అక్కడే వింతుని చూడ సాగింది ఆ చిత్రీకరణని.

"టచప్," అరిచింది హీరోయిన్.

టచప్ పిల్ల దగ్గరకి రాగానే పౌడర్ అద్దుకుంది బుగ్గలకి.

"సౌండ్."

స్పీకర్‌లోంచి పాట తాలూకు ఓ చరణంలోని కొద్ది భాగం మొదలయింది. అసోసియేట్ డైరెక్టర్ పాటలోని చరణం ఎక్కడనుంచి తీయాలో సూచన లిచ్చాడు.

పాట మళ్ళీ మొదలయింది.

కెమేరా తిరుగుతోంది. హీరోయిన్ డాన్స్ డైరెక్టర్ చెప్పిన స్టెప్స్ వేస్తూ హీరోని కటకటాల వెనకాల బంధిపబడి వున్న కోతులతో పోల్చి గేలిచేస్తూ ఆటలు పట్టించింది.

షాట్ అయాక తర్వాతి షాట్ సిద్ధం చేసే ప్రయత్నంలో పడ్డారు అంతా.

నిరూప హీరోయిన్ వంక కళ్ళప్పగించి చూస్తూండిపోయింది. నిరూప కళ్ళ నిండా కొత్త కాంతి. ఎంతో సంతోషంగా చూసింది ఆ తతంగాన్ని.

ఏదో ఓ రోజు తనూ అలా హీరోయిన్ అయి 'టచప్' అని అరుస్తుంది షాట్ ముందు.

దర్శకుడు రాగానే రెండు సన్నివేశాలు డైలాగ్స్ చెప్తూ నటించి చూపించింది.

"అవకాశం వచ్చినప్పుడు పిలుస్తాను. మీ అడ్రస్ వ్రాసివ్వండి," అన్నాడు దర్శకుడు.

ముందరే సిద్ధంగా వుంచిన కవరు తీసి అందించింది నిరూప. ఆ కవరులో నిరూప ఫొటో, దాని వెనకాల చిరునామా వున్నాయి.

"మీ వయసెంత ?" అడిగాడు.

"పందొమ్మిది."

"గుడ్."

"ఇప్పట్లో అవకాశం రాదా!"

చిన్నగా నవ్వాడు.

"అయిదారు నెలల్లో రావచ్చు. ఓ చిన్న పాత్ర ఇస్తాను ముందర. నిర్మాతతో చెప్పి చూస్తాను. మద్రాస్‌కి పిలుస్తాను. స్క్రీన్ టెస్ట్ మొదలయినవి అక్కడ అయాక ఫైనల్‌గా ఏ సంగతీ చెప్తాను."

నిరూప మొహంలో కొద్దిగా అసంతృప్తి కనిపించింది.

"ఈ చిత్రంలో చిన్న పాత్ర ఏదయినా....?" అర్థాక్తిగా ఆపేసింది.

"సారీ. లేదు."

"తప్పక గుర్తించుకుంటారుగా నా సంగతి"

"అలాగే! నేను కొత్తవాళ్ళ కోసం వెదుకుతున్నాను. ప్రయత్నిస్తే నష్టమేం లేదుగా" నవ్వాడు.

"థాంక్స్ సర్"

"యు ఆర్ వెలకం."

"వెళ్ళొస్తాను."

"కాఫీ తీసుకుని వెళ్ళండి."

ప్రొడక్షన్ అసిస్టెంట్‌ని పిలిచి దర్శకుడు నిరూపని చూపించి కాఫీ ఇమ్మని చెప్పాడు.

తర్వాత షాట్ సిద్ధం అవడంతో వెళ్ళిపోయాడు హడావిడిగా.

కాఫీ తాగుతూ నిరూప మళ్ళీ హీరోయిన్ అభినయించే తర్వాతి షాట్‌ని శ్రద్ధగా చూసింది.

నిరూప గుండెనిండా కోటి ఆశలు.

*   *   *

శ్రీలేఖకి విశ్రాంతి అరుదుగా లభిస్తుంది. గత ఎనిమిదేళ్ళుగా మూటవిభై పైనే నటించింది, వివిధ చిత్రాలలో వందపైనే శతదినోత్సవాలు జరుపుకున్నాయి. శ్రీలేఖ నటించిన సినిమాకి ఓపెనింగ్స్ బావుంటాయి. ఆమెకోసం కథ సిద్ధంచేసి ఎప్పుడు కాల్‌షీట్ ఇస్తే అప్పుడు చిత్ర నిర్మాణం చేసేందుకు సదా నలుగురయిదుగురు నిర్మాతలు వేచివుంటారు.

ఉదయం అయిదున్నరకి నిద్ర లేచింది ఆరోజు. ఆరున్నరకల్లా మేకప్ చేసుకుని స్టూడియోకి బయలుదేరింది. ఏడుంపావు నుండి పదుకొండున్నరదాకా ఓ చిత్రం తాలూకు పని పూర్తిచేసింది. సరాసరి ఇంకో స్టూడియోకి వెళ్ళింది. మేకప్ మార్చుకుని అక్కడ ఒంటిగంట నుంచి నాలుగుదాకా కెమేరాముందు నటించింది. అయిందింటికి స్టూడియో నుంచి ఇలియట్స్‌బీచ్‌కి వెళ్ళింది. ఓ చిత్రంలో మిగిలిపోయిన చిన్న సన్నివేశం సముద్రం ఒడ్డున నటించింది. ఆరున్నరకి వికలాంగులయిన చిన్న పిల్లల హాస్టల్ నిర్మాణంకోసం నిధులు సేకరించడానికి ఏర్పాటుచేసిన ఓ ఎంటర్‌టెయిన్‌మెంట్ ప్రోగ్రాంలో ముఖ్య అతిథిగా పాల్గొనడానికి వెళ్ళింది. ఎనిమిది దాకా అక్కడే వుండి, నాటకం మధ్యలో వచ్చేసింది.

సరాసరి ఓ స్టూడియోకి వెళ్ళింది. నెల రోజులనుంచి ఎదురు చూస్తున్నారు నిర్మాతలు శ్రీలేఖ కోసం. వారి చిత్రం తాలూకు డబ్బింగ్ వర్క్‌ని పూర్తిచేయడానికి రాత్రి ఒంటిగంటదాకా స్టూడియోలోని రికార్డింగ్ థియేటర్‌లోనే వుంది.

అక్కడనుంచి సరాసరి కారులో

తిరుపతి బయలుదేరింది. వరసగా వారం రోజులు అవుట్‌డోర్‌లో పాల్గొనడానికి.

కొద్దిగానయినా విశ్రాంతి, తీరిక దొరకలేదు. కొన్ని సంవత్సరాలుగా తీరుబడి లేకుండా అవిధంగా శ్రమిస్తోంది శ్రీలేఖ.

తను నటించిన చిత్రాలన్నీ చూడటానికి తీరుబడి చిక్కడంలేదు.

శ్రీలేఖకి షాపింగ్ అంటే ఇష్టం. కాని అందరిలా బజారుకెళ్ళి తనకి నచ్చిన బట్టలు, వస్తువులు కొనుక్కునే భాగ్యానికి నోచుకోలేకపోతోంది. రహస్యంగా వెళ్ళాలి. ఎక్కడికి వెళ్ళినా ట్రాఫిక్ లైట్ల దగ్గర కారు కొన్ని క్షణాలాగితే, ఎవరయినా రోడ్డుమీద పోయేవాళ్ళు గుర్తుపడితే ఆటోగ్రాఫ్‌లకోసం ఎగబడతారు.

క్షణం తీరిక వుండదు. క్షణం స్వతంత్రం వుండదు. తన బట్టలు తను ధరించే అవకాశమే రాదు. ఎవరి బట్టలో ధరించి ఎవరి జీవితమో నటించాలి. ఏడవాలి. నవ్వాలి. ఎగరాలి. గెంతాలి. అన్ని రసాలు పోషించాలి.

విసుగెత్తి పోయింది శ్రీలేఖకి తన జీవన విధానం.

అందుకే తన పారితోషికాని పెంచేసింది. సంవత్సరానికి కేవలం ఆరు చిత్రాలకంటె ఎక్కువ నటించికూడదని నిర్ణయించుకుంది.

* * *

ఆదిలక్ష్మికి జీవితం ఎంతో భారంగా, బరువుగా వుంది. కొన్ని సంవత్సరాలు, దాదాపు పన్నెండు సంవత్సరాలు తను అనుభవించిన జీవితం చేజారిపోయింది. తను చవిచూసిన థ్రిల్, ఆనందం కరువయి పోయాయి.

పన్నెండు సంవత్సరాల పాటు వెండి తెరమీద ఏకైక రాణిలా వెలిగిపోయింది. హీరోయిన్‌గా రెండు వందల చిత్రాల్లో నటించింది. లెక్కలేనన్ని సార్లు శత దినోత్సవాలకి, ఇతర ఫంక్షన్స్‌కి హాజరయింది.

క్షణం తీరికలేకుండా గడిచిపోయింది. దర్శకులు, నిర్మాతలు, సహనటీనటులు, టెక్నీషియన్స్ తన రాక కోసం సెట్స్‌మీద గంటల తరబడి ఎదురుచూసేవాళ్ళు. తనని ఎంతో భక్తిగా ఆదరంగా పలకరించేవారు.

కోటి హీరోయిన్లలో కొందరు అక్కా అని పిలిచేవారు కూడా. ఆ జీవితమంటేనే విసుగు పుట్టేటంత పూర్తిగా జీవించింది తను అందులో.

ప్రేక్షకులు ఆదిలక్ష్మిని చూడటానికి వెళ్ళేవాళ్ళు సినిమాలకి.

క్రమంగా తనకి వయసు పైబడుతున్న కొద్దీ, శరీరంలోని పటుత్వం, జిగి, ఒంపు సొంపులు తగ్గి ముసలితనం మొహంలో

కనబడసాగింది. ఇదివరలా సన్నగా లేదు తను. బరువు పెరిగింది.

ఈలోగా కొత్తహీరోయిన్లు వచ్చారు. ప్రేక్షకులు తనని క్రమంగా మరిచిపోయి కొత్త హీరోయిన్ల చిత్రాలు చూడటానికి అలవాటుపడ్డారు.

తను మేడ దిగి ఎప్పుడు కిందకి వస్తుందా అని తన డ్రాయింగ్‌రూమ్‌లో గంటల తరబడి వేచివున్న నిర్మాతల దగ్గరకే తాను వెడితే కనీసం తనని చూడటానికి కూడా నిరాకరించారు.

ఇదివరలో తను నటించిన చిత్రం ఫస్ట్‌ప్రింటు కాగానే కొన్ని వారాల తరబడి అగి, ప్రింట్ తనకి వేసి చూపించాకే విడుదల చేసేవారా చిత్రాన్ని కొందరు నిర్మాతలు. నడుద్దామన్నా కుదిరేది కాదు. కారులోంచి కాలు కింద పెట్టకుండా నడిచిపోయింది.

ఇప్పుడు....

కారు లేదు. ఆ ఇల్లు లేదు. ఆ పాత్ర ల్లేవు నటించడానికి. తనని చూడటానికి వచ్చే అభిమానులు లేరు. ఆ చిత్ర ప్రపంచంలో అసలు తనే లేదు ఇప్పుడు. పరిశ్రమనించి తప్పుకున్న అనేక వందల మంది ఎక్స్‌ట్రాలలో తనొకరిలా, వారితో సమానంగా దూరమయింది పరిశ్రమలోని వ్యక్తులకి.

ఎప్పుడయినా ఓ జర్నలిస్టు వచ్చి పది, పదిహేను ప్రశ్నలు అడిగి ఇంటర్వ్యూ ప్రచురిస్తాడు పత్రికలో. తనతో హీరోగా నటించిన వ్యక్తికే తనని తల్లిపాత్రలు వేయమని అప్పుడప్పుడు అడుగుతూంటారు కొందరు నిర్మాతలు.

ఇక తిరిగిరాదా వసంతం. ఇంక ఎన్నడూ రాదా జీవితం వాడిపోయిన పువ్వులా, ఖాళీ అయిన పూలకుండీలా మొండిగా సాగిపోతోంది ఆదిలక్ష్మి జీవితం.

తన మరణం కోసం ఎదురుచూస్తున్నారు చాలా మంది. ఆదిలక్ష్మి మరణిస్తే కొందరు తన శవాన్ని మోసి, సంతాప సభ లేర్పాటుచేసి సంబరం జరుపుకుంటారు. కొందరు 'ఇంత గొప్ప నటి ఇక లేదు. మరి రాదు' అని వ్యాసాలు రాస్తారు. కొందరు తను నటించిన చిత్రాల్లో కొన్ని మళ్ళీ వెంటనే విడుదల చేసి డబ్బు చేసుకుంటారు.

అంతా ఏకగ్రీవంగా అంగీకరిస్తారు తనంత గొప్ప నటి లేదని.

ఈ జీవితంలో తను మిగుల్చుకొన్నది ఆ కీర్తి ఒక్కటే.

---